# కన్నీటి మెరుపులు

యర్రంనేని చంద్రమౌళి



నాటిక

అది ఒక భవనంలో అందమైన హాలు. కళా హృదయాలకు ప్రతిబింబాల్లా కొన్ని చిత్రాలు గోడలకు అమర్చబడి ఉన్నాయి. కుడివైపుగా మేడ మీదికి మెట్లు. హాలు మధ్య సోఫా సెట్. దాని ముందు టీపాయ్. హాలు కుడి ఎడమల ద్వారాలు. ద్వారాలకు ఆకర్షణీయమైన తెరలు. హాలు మధ్య లోనికి ఒక ద్వారం. ద్వారంపై భాగాన మురళి ఊదుతున్న కృష్ణుడి చిత్రం. మెట్ల పక్కగా టేబులు. దానిమీద టెలిఫోను, కొన్ని పుస్తకాలు. ఎడమ ద్వారం వైపు కిటికీ పక్కగా మరొక టేబులు.

గంగాధరం : ( బయటినుంచివస్తూ, చేతి గడియారం చూసుకొని ) రంగన్నా! ... రంగన్నా! ... ఏరీ, ఎవరూ లేరే! ... అమ్మాయ్, కల్పనా! ... రేయ్, సుందర్! ...

రంగన్న : ( వీధిలోనుండి వచ్చాడు. చేతిలో పూల పొట్లం ఉంది. )

కల్పన : ( జడ అల్లుకుంటూ కుడి ద్వారంగుండా వచ్చింది. )

గంగాధరం : ఏమిటమ్మా — మరీ ఇంత ఆలస్యమైతే ఎలా?

కల్పన : అదికాదు, నాన్నా, రంగన్న పూలకోసం వెళ్ళి ...

రంగన్న : ఇదుగో ... తెచ్చానమ్మా! ( పూలు ఆమెకు ఇచ్చాడు. )

సుందర్ : ( టై కట్టుకుంటూ మధ్య ద్వారంగుండా వచ్చి ) వచ్చేశాను, మామయ్యా! ( పల్చని రూపు, రాగి రంగు జుట్టు, దుబ్బుల్లాంటి కనుబొమలు, ఎర్రజీరల కళ్ళు. )

గంగాధరం : ఊఁ! ... రంగన్నా! కారు రెడీ చెయ్యమను.

రంగన్న : అట్లాగే, బాబూ! ( బయటికి వెళ్ళాడు. )

గంగాధరం : నువ్వింకా నిలబడే ఉన్నావేరే! త్వరగా తెములు!

సుందర్ : ఇదుగో, ఒక్క నిమిషం, మామయ్యా! ( లోనికి వెళ్ళాడు. )

కల్పన : ( పూల పొట్లం విప్పుతూ లోనికి వెళ్ళబోయింది. )

గంగాధరం : చూడమ్మా!

కల్పన : ( ఆగింది. )

గంగాధరం : చిరంజీవి కనిపించడేం?

చిరంజీవి : ( మెట్లమీది నుంచి క్రిందికి దిగుతూ ) వస్తున్నానండీ!

గంగాధరం : ( అతన్నిచూచి ) ఆఁ! ... వెరీగుడ్!

కల్పన : అసలు ప్రోగ్రాం ఎన్నిగంటలకు, నాన్నా?

గంగాధరం : ఖచ్చితంగా ఆరున్నర గంటలకమ్మా!

కల్పన : ( తన చేతి వాచి చూస్తూ ) ఇంకా రెండు గంటల టైం ఉంది, నాన్నా!

గంగాధరం : ( తన వాచిని చూచుకొని, చెవి దగ్గర పెట్టుకొని రెండు క్షణాలు విని ) అరె!

నా మతి చదస్తంగాను ... ఇదీ ఉదయం ఆరు గంటలమీదే ఆగిపోయింది. కీ ఇవ్వటం మరిచానమ్మా! (హాయిగా నవ్వుతూ, వాచికి కీ ఇచ్చి, టైం సరి జేసుకుంటాడు.)

కల్పన : (కిలకిల నవ్వుతూ) భలేవారు, నాన్నా! ఆగి పోయిన మీ వాచీ ఇంత హడావిడీ చేసింది.

గంగాధరం : ఏరేనమ్మా! నాదే తప్పు — ఒప్పుకుం టున్నాగా! ఇక తాపీగా తయారవండి.

రంగన్న : (వచ్చి) కారు రెడీ, బాబూ!

గంగాధరం : రంగన్నా! నువ్వు రెడీగా ఉండు.

రంగన్న : (ఆశ్చర్యంగా) నే నెందుకు, బాబూ? నాకేం తెలుసుద్దా, పాడా!

గంగాధరం : అదేమిటోయ్! బ్రహ్మాండమైన భరత నాట్యం! నువ్వూ చూసి తీరాలి. మనందరికీ టిక్కెట్లు తెప్పించాను—తెలుసా?

రంగన్న : (కృతజ్ఞతతో, విధేయపూర్వకంగా) అట్లాగే, బాబూ, మీ మాటకి తిరుగే ముంటుంది! (వీథిలోకి వెళ్ళిపోయాడు.)

గంగాధరం : చిరంజీవి! నీ ఆరోగ్యం ఎలా ఉంది, నాయనా?

చిరంజీవి : ఇప్పుడు చాలా బాగుందండి—మీ దయవల్ల.

గంగాధరం : అరె! మా దయ ఏమిటోయ్!

చిరంజీవి : అవునండి! ఇక్కడి కొచ్చాక ఈ నెల రోజు ల్లోనే పాత జ్ఞాపకాలన్నీ మరిచిపోగలిగాను. మీ అందరి మధ్యా హాయిగా కాలం గడిచి పోతోంది.

గంగాధరం : వెరీ గుడ్!... అలాగే ఉండాలి! ... పాపం జగన్నాథం ...

చిరంజీవి : మా అమ్మ మాకు దూరం కావడంతో మా నాన్న మరీ క్రుంగిపోయారు.

గంగాధరం : అవును. (కల్పనతో) మ వ్వైరగవుగా నమ్మాయ్ — వీళ్ళమ్మ శాంతమ్మ సాక్షాత్తు పార్వతీదే వనుకో! నాకు చెల్లెలు పోయిన లోటు తీర్చింది!

కల్పన : ఊరుకోండి, నాన్నా, మళ్ళీ అవన్నీ జ్ఞాపకం చేసి వారిని మరీ బాధపెట్టడం ...

గంగాధరం : ఓ! అలాగేనమ్మా! చూడు, నాయనా చిరంజీవీ, అనవసరంగా ఆలోచించి మనస్సు పాడుచేసుకోకు. నాకు ప్రాణంలాంటి వాడు మీ నాన్న జగన్నాథం! అలాంటిదీ మా స్నేహం! ఎలాంటి అరమరికలు లేకుండా మవ్వు మాలో ఒకడుగా మెలగాలి.

చిరంజీవి : అలాగేనండి! మా నాన్నగారు ఎప్పుడూ మీ గురించే చెబుతుంటారు! ... మా అమ్మను తలుచుకుని నేను దిగులుపడు తుంటే మా నాన్న మరీ బాధపడేవారు!

గంగాధరం : అవును బాబూ! మీ నాన్న నాకు అన్ని విషయాలూ ఫోను చేసి చెప్పాడు. అందుకే ... స్థలం మార్పుతోనైనా కొంత మనశ్శాంతిగా ఉంటుందనే ఉద్దేశ్యంతో నిన్ను మా దగ్గరకు పంపించ మని మీ నాన్నతో నేనే చెప్పాను. నీ కిక్కడ ఏ కొరతా ఉండదు.

కల్పన : వీరు మనతో బాగా కలిసిపోయారు, నాన్నా!

చిరంజీవి : (కల్పనతో) అందుకు మీ కెంతో ఋణ పడ్డాను! (గంగాధరంతో) అవునండీ ... కల్పనగారే నన్ను మళ్ళీ మామూలు మనిషిగా మార్చారు.

గంగాధరం : అవును, బాబూ, ఇంకొకళ్ళ బాధని తనదిగా భావించి బాధపడే మనస్తత్వం అమ్మాయిది! నా బాధ్యత అమ్మాయి స్వీకరించింది — నా కూతురు కాబట్టి. (చిరునవ్వుతో) ఏమంటావమ్మా?

కల్పన : సరేలే, నాన్నా, ఇదీ ఒక బాధ్యతేనా? మన కనీస ధర్మం ఇది!

గంగాధరం : వెరీ గుడ్! ... ఆ!... త్వరగా రెడీ అవండి, బాబూ!

కల్పన : (చిరంజీవితో) పదండి!

(చిరంజీవి మేడమీదికి, కల్పన కుడి ద్వారంలోకి వెళ్ళిపోయారు.)

గంగాధరం : (వారు వెళ్ళిన వైపే తదేకంగా చూస్తున్నాడు.)

**పాత్రలు :**

| | |
|---|---|
| సుందర్ | 25 సం॥ |
| చిరంజీవి | 26 సం॥ |
| గంగాధరం | 45 సం॥ |
| రంగన్న | 50 సం॥ |
| బంగారయ్య | 40 సం॥ |
| కల్పన | 20 సం॥ |

రంగన్న : (బయటినుంచి వచ్చి, తన చేతిలో ఉన్న ఎర్రటి పూల గుత్తిని — ఎడమ పక్కగా ఉన్న టేబులుమీదున్న పూల జాడీలో ఉంచి, గంగాధరం గారితో) వచ్చేశా నయ్య గారూ!

గంగాధరం : (అతన్ని చూచి) వెరీ గుడ్! అలా ఉండాలి. ఆ! రంగన్నా! వాళ్ళిద్దర్నీ చూస్తుంటే నీ కేమని పిస్తుందోయ్? !

రంగన్న : (అర్థంగానట్లు చూస్తూ) ఎవుర్ని, బాబూ!

గంగాధరం : ఊ ... ఆమాత్రం ఊహించలేకపోతే ఎలాగోయ్! మన అమ్మాయిని, చిరంజీవిని ...

రంగన్న : అన్నా చెల్లెళ్ళాగ కలిసి మెలిసిపోయారు బాబూ!

గంగాధరం : (కోపంగా) రంగన్నా! (వెంటనే సర్దు కొని) ఆ! చూడూ ... నే ననేది వాళ్ళిద్దరూ జంటగా ఉంటే ...

రంగన్న : అంటే తమ ఉద్దేశం? !

గంగాధరం : అదేనోయ్ ... సరైన ఈడూ జోడూ — వీళ్ళిద్దరూ దంపతులైతే ...

రంగన్న : బాబూ! అంతమాటనకండి.

గంగాధరం : ఏమిటోయ్ — అందులో తప్పేముంది?

రంగన్న : తప్పనిగాదు, బాబూ, ఆడిన మాట తప్పడం...

గంగాధరం : ఆడిన మాటా?

రంగన్న : అవునయ్యా! దయ తప్పిన దేవుడు సుందర బాబుని ఏకాకిని జేశాడు.

గంగాధరం : ఇప్పుడు సుందర్‌కి జరిగిన అన్యాయ మేమిటోయ్ — మనమంతా లేమూ?

రంగన్న : అదేనయ్యా! మనమంతా ఉండికూడా ఆ బాబుకి అన్నాయుం జరుగుతుంటే ...

గంగాధరం : (కొద్దిగా విసుక్కుని) ఇంతకూ నువ్వు చెప్పేదేమిటోయ్?

రంగన్న : తమకి తెలియందేముంది, బాబూ! ఆ పాపిష్టి కలరా తమ బావగార్ని, మాలతమ్మగార్ని పొట్టన పెట్టుకుంది. ఆయమ్మ కన్ను మూస్తూ—"అన్నయ్యా! సుందర్ నీ మేన ల్లుడు. వాణ్ణి ..."

గంగాధరం : అవునోయ్! ... కాదని ఇప్పుడు ఎవ రన్నారు?

రంగన్న : అన్నారనికాదు, బాబూ, ఆయమ్మకి మీ రిచ్చిన మాట గ్యాపకం జేస్తుండా నంతే!

గంగాధరం : (కొద్దిక్షణాలు మౌనం) నా కంటి పాప కన్నా మిన్నగా చూసుకున్న నా చెల్లెలు మాలతి కిచ్చిన మాట మరిచిపోతానా, రంగన్నా! ఈ నాటి ఈ సిరిసంపదలు, భోగభాగ్యాలు నా చెల్లెలివి! వీటితోబాటు ఏడేళ్ళ పసివాణ్ణి — సుందర్ని నా చేతుల్లో బెట్టి వాళ్ళు కన్నుమూశారు. సుందర్‌తోబాటు సంపదనూ పెంపు జేశాను. ఈ నాడు వాడొక ప్రయోజకు డయ్యాడు. అందుకే సుందర్‌కి తన ఆస్తిని అప్పగించి నా చెల్లెలి కిచ్చిన మాట నెరవేర్చుకుంటాను.

రంగన్న : ఏంటి, బాబూ, తమ రంటూంది? !

గంగాధరం : అవును, రంగన్నా! ఈ సంపదకు వారసుడు సుందర్. వాడు పసిబిడ్డగా ఉన్నంత కాలం వాడి ఆస్తిని కాపాడవలసిన వాళ్ళమే గాని, దానికి హక్కుదార్లం ఎన్నటికీ కాలేం గదా. ఇప్పుడు సుందర్ స్వతం త్రుడు. ఎవరి సొత్తును వాళ్ళకు అప్ప గించకుంటే లోకం ఏమంటుందో తెలుసా?

రంగన్న : మన్నించండి, బాబూ! తమ ఉప్పూ పులుసు తింటూ తమకి ఎదురు సెప్పేటంతటి నీమణ్ణి గాను. కాని ...

గంగాధరం : చెప్పు, రంగన్నా, నీ అనుమానమేమిటో నిర్భయంగా చెప్పు.

రంగన్న : కలవనమ్మగారిని సుందర బాబు కిచ్చి పెళ్ళి జేత్తామని తమరు ఆ నాడు మాలతమ్మగారి సేతులో సెయ్యేసి సెప్పారు! ఆ సంతోషం తోనే ఆ తల్లి కన్నుమూసింది!

గంగాధరం : (గతాన్ని గుర్తు చేసుకుంటూ) నిజమే, రంగన్నా, ఆ మాట నేను కాదన్ను. సుందర్ సంపన్నుడు. అంతకుమించి గుణ వంతుడు. అలాంటి సుందర్‌కి భార్య

కావటం కన్నా కల్పనకి మరొక అదృష్టం ఏ ముంటుంది?

రంగన్న : అమ్మాయిగా రంటే సుందర బాబుకి ప్రాణం, బాబూ! నా కీ సంగతి బాగా తెలుసు!

గంగాధరం : కావచ్చు. కానీ, అమ్మాయి ...

రంగన్న : తమరు అవునంటే అమ్మాయిగారు కాదంటారా, బాబూ ?

గంగాధరం : కాదనకపోవచ్చు. కాని, ఒక వేళ ఆమెకు ఇష్టం లేదనుకో. అప్పుడు బలవంతంగా ఒప్పించి వాళ్ళకి పెళ్ళి చేశామనుకో! ... దానివల్ల కలిగే ఫలితం ... వాళ్ళ జీవితాలు అశాంతితో అల్లాడి పోవడమేగా! ?

రంగన్న : అట్టా ఎందుకు జరుగుద్ది, బాబూ?

గంగాధరం : అలా జరగాలని నేనుమాత్రం కోరుకుంటానా, రంగన్నా! భగవంతుడు నన్ను క్షమిస్తే — ఒక్క మాట చెబుతాను! లోకంలో ఎంతటి కురూపులైనా అందాన్నే కోరుకుంటారు.

రంగన్న : అర్థమైంది, బాబూ, ... సుందరబాబు రూపానికి నలుపనే గాని, మనసు పాల కంటే తెల్లన, బాబూ ...

గంగాధరం : అని నువ్వూ, నేనూ అనుకుంటాం. కాని, సుందర్‌తో ఆరు కాలాలు అర్థాంగిగా జీవితం గడపవలసిన కల్పన అనుకోవడం ముఖ్యం.

రంగన్న : అయినా, తమ రోపారి అమ్మాయిగారితో ఈ సంగతి కదిపి చూడండి, బాబూ!

గంగాధరం : కన్నతండ్రిగా నా కాపాటి బాధ బాధ్యత ల్లేనంటావా? నీకు తెలియదు, రంగన్నా, నాలో నేను ఎంతగా నలిగిపోతున్నానో నీకు తెలియదు! అటు నా చెల్లెలి కిచ్చిన మాట, ఇటు వీళ్ళ పెళ్ళి సమస్య! సరే ... కానివ్వు ... అన్నిటికీ ఆ భగవంతుడే ...
(ఇంతలో ఫోను మోగింది.)

గంగాధరం : (ఫోన్లో) ఎస్! ... గంగాధరం స్పీకింగ్! ఎవరూ? ... ఓ! ... శంకర్రావుగారా! ఆఁ ... నమస్కారం! ఆఁ ఎందుకూ, ఇదుగో, ఇప్పుడే బయలుదేరి వస్తున్నా! (ఫోను పెట్టేసి) రంగన్నా!

రంగన్న : బాబూ!

గంగాధరం : సుందర్ని ఒకమా టిలా రమ్మను.

రంగన్న : అట్లాగే, బాబూ! (సుందర్ గదిలోకి వెళ్ళాడు.)

గంగాధరం : (టీపాయ్ మీదున్న ఆ నాటి పత్రికను తీసుకుని చూస్తుంటాడు.)

సుందర్ : (వచ్చి) ఏం, మామయ్యా?

గంగాధరం : చూడు, సుందర్, ఢిల్లీ నుంచి శంకర్రావు గారు వచ్చారు. మన బిల్డింగ్ విషయం...

సుందర్ : నన్నడుగుతారేం, మామయ్యా? మీరు ఇష్టపడితే అమ్మేయండి.

గంగాధరం : అదికాదురా! ఏదైనా నీతో చెప్పి చేయడం మంచిదని ...


సుందర్ : నాతో చెప్పకుండా చేయడంలో చెడు ఉంటుందా? నేను కేవలం మీ నీడగా ఉండే వాణ్ణే, మామయ్యా!

గంగాధరం : (తృప్తిగా) సరే, నాయనా, నాకు తెలయుంది [illegible] మూసుకుని) ఆఁ .. [illegible] వచ్చేస్తాను. మీరు మాత్రం ...

సుందర్ : రెడీగా ఉంటాం, మామయ్యా!

గంగాధరం : (చిరునవ్వుతో) వెరీ గుడ్! (వీధిలోనికి వెళ్ళిపోయాడు.)

సుందర్ : (గోడమీద మురళి ఊదుతున్న కృష్ణుడి చిత్రాన్ని చూశాడు. ముఖం ఆనందంతో విప్పారింది. కల్పన గదివేపు చూశాడు. గది ద్వారం వరకు వెళ్ళాడు. అంతలోనే కళ్ళల్లో బాధాపూరిత ఛాయలు అలుముకున్నాయి. దీనంగా శూన్యంలోకి చూస్తూ, మళ్ళీ కృష్ణుని పటం వద్దకు వచ్చి పటంకేసి చూస్తుంటాడు.)



రంగన్న : (వచ్చి) అట్లా ఉండారేం, బాబూ!

సుందర్ : ఆఁ! ... (తేరుకొని) నువ్వా! ... ఏం లేదు, రంగన్నా!

రంగన్న : (లాలనగా నవ్వుతూ) నా దగ్గర దాస్తా రెందుకు, బాబూ! ఇప్పుడే పెద్దయ్యగారితో అంతా చెప్పానే.

సుందర్ : ఏమని?

రంగన్న : తమ పెళ్ళి సంగతి.

సుందర్ : నా పెళ్ళా? !

రంగన్న : అవును, బాబూ!

సుందర్ : రంగన్నా! ఏ తల్లిదండ్రులైనా కోరుకునేది తమ బిడ్డ అందంగా ఉండాలనేగా!

రంగన్న : అంతేగా, బాబూ!

సుందర్ : అందుకే మా అమ్మ తన బాధను దాచుకుంటూ తన కోరికను ఇలా తీర్చు

రంగన్న : [illegible]

సుందర్ : (గుండెల్లోని వ్యథను అణచుకుంటూ, లేని చిరునవ్వు బలవంతంగా తెచ్చుకుంటూ) నాకు సుందర్ అని పేరు పెట్టుకొని.

రంగన్న : మీకేం ... నిచ్చేసంలాంటి బాబు...!

సుందర్ : ఆత్మవంచన మహాపాపం, రంగన్నా!

రంగన్న : అట్లాగంటారేం, బాబూ?

సుందర్ : కాకుంటే ... నా తృప్తికోసం, నా ఆనందం కోసం — ఈ కురూపిని, ఈ కారు నలుపుని ఎందుకు అంతగా పొగుడుతున్నావ్?

రంగన్న : మిమ్మల్ని మీరే ఇట్టా కించపర్చుకోకండి, బాబూ! నిజంగా మీరు నా కళ్ళకి శానా అందంగా కనబడతారు.

సుందర్ : అదీ — నా దురదృష్టం! చూడు ... నా ముఖాన్ని సూటిగా చూసి నిజం చెప్పు! (నిస్పృహాయంగా) హుఁ . . . అబద్ధానికి కూడా వెగటుగా ఉంది నా అందం!

రంగన్న : రోజూ మీ రిట్టా కుమిలిపోవటం మంచిది కాదు. మనిషికి అందం మనసు గాని, రంగు కాదు, బాబూ!

సుందర్ : నువ్వెంతగా నన్ను ఓదార్చేందుకు ప్రయత్నించినా, నా ఈ వికార రూపాన్ని అందమైన బట్టలతో కప్పుకునేందుకు నే నెంతగా వ్యర్థ ప్రయత్నం చేసినా ... అసంతృప్తి అలుముకున్న నా బ్రతుక్కి ప్రశాంతత శూన్యం, రంగన్నా! ఆశను జయించిన నిరాశ నన్ను రోజు రోజుకీ పరిహసిస్తోంది. నాలోని న్యూనతను జయించలేని బలహీనుణ్ణి నేను! (అంత బాధలోనూ తేలికగా నవ్వి) నాలాంటి వికారుల్ని, అసమర్థుల్ని ఏ ప్రయోజనం కోసం పుట్టిస్తాడో భగవంతుడు!

రంగన్న : బగమంతుడికి అందరూ సమానమే, బాబూ! ఆయ వేం చేసినా మన మంచికే చేస్తాడు.

లోకంలో కళ్ళులేని కబోదు లెందరు లేరు, సుందరబాబూ!

సుందర్ : కబోదినైతే నా కీ బాధే ఉండేదికాదు! పిశాచపు నీడలా అనుక్షణం నన్ను వెంటాడే నా ఈ ఆకారాన్ని చూడగలిగే వాణ్ణి గాను. అప్పు డిక నాకు ఏ చింతా ఉండదుగా!

రంగన్న : మీరు నిచ్చింతగా ఉండాల, బాబూ! ఈ మాటలు అమ్మాయిగా రింటే ఎంత బాద పడతారో ఆలోసించారా?

సుందర్ : అవును! కల్పన గురించి ఎలాంటి భావనా నాలో లేకుంటే అసలు బాధంటే ఏమిటో తెలిసేదిగాదు. ఆమెను గురించి ఆలోచించడం వల్లనే కాలం బల్లెంలా గుండెల్ని గుచ్చుతోంది!

రంగన్న : అసలు తమ బాద ...

సుందర్ : నీ కర్థంకాదు!... అయితే, పితృ వాత్సల్యంతో నన్ను పెంచిన నీ దగ్గర నా గుండెల్ని పిండుతున్న వ్యధను దాచలేను. ఒక్క మాట అడుగుతాను. నిజంగా ... నిజం చెప్పవూ, రంగన్నా?

రంగన్న : నవ్వులాటకైనా మీతో ఎప్పుడన్నా అబద్దం సెప్పానా, బాబూ!

సుందర్ : నే నంటే కల్పనకి ఎలాంటి అభిప్రాయ ముందో చెప్పు మరి? !

రంగన్న : అదేంటి, బాబూ, అమ్మాయిగారికి తమ రంటే బలే అబిమానం. "బావ శానా మంచోడు, రంగన్నా" అంటూ తమర్ని ఎప్పుడూ తెగ పొగుడుతుంటారు అమ్మాయిగారు!

సుందర్ : అవును. ... కల్పనకి నే నంటే అభిమానం; నాకు కల్పనంటే ప్రాణం!

రంగన్న : అందుకేగా, బాబూ, మీ ఇద్దరికీ తొందర్లో పెళ్ళి సెయ్యా లనుకుంటుండారు అయ్యగారు?

**సుందర్ : అని మామయ్య అన్నాడు గదూ!**

రంగన్న : అవును, బాబూ!

సుందర్ : పాపం! మామయ్య మంచితనం, నా స్వార్థం కలిసిన ఫలితం — కల్పనకి తీరని అన్యాయం జరగడం!

రంగన్న : అదేంటి, బాబూ?

సుందర్ : కాకి ముక్కుకు దొండపండు లాంటి పొత్తు మా ఇద్దరికీ! చంద్రబింబంలాంటి కల్పన బ్రతుకులో కాలమేఘం లాంటి నా ఉనికి! అలా అని కల్పన్ని వదులుకోలేను. కల్పనకి నేను అనర్హుణ్ణని నా మనస్సాక్షికి తెలుసు. తెలిసీ తప్పుకోలేని నా స్వార్థం! అందుకే, రంగన్నా, నే నొక నిర్ణయానికొచ్చాను.

రంగన్న : ఏంటి, బాబూ?

సుందర్ : కల్పన కన్నీటిని సైతం చూడలేను. వాటిని ఆపేందుకు నా ప్రాణాన్నైనా అడ్డు వేస్తాను. అంత గాఢంగా కల్పన నా హృదయంలో అల్లుకుపోయింది. అది నా జీవన లత! ఆ లతను స్వార్థంతో నలిపి వేయనూ లేను; కాదని పక్కకి తోసి



**అలంకారం**

చిత్రం—ఓ. గంగాధర్ (జగిత్యాల్)

వేయనూ లేను. అందుకే ... ఆమె సుఖపడాలంటే నేను దూరంగా ... ఎవరికీ అందనంత దూరంగా వెళ్ళిపోతాను. కనీసం కల్పన నా కలల్లోకి రానంత దూరం వెళ్ళిపోతాను.

రంగన్న : బాబూ! ... అంతమాట ... అంతమాట నేను వినకుండా ముందు నన్ను సంపండి ...

కల్పన : ( వస్తూ ) ఏం, బావా, మీ రప్పుడే రెడీ అయ్యారే! ... నాన్నగా రేరీ? ... ( ఇప్పు డామె ఎర్రచీర, ఎర్ర రవికె ధరించి ఉంది. నుదుట ఎర్రటి తిలకం, తలలో ఎర్రటిపూలు, మెడలో ఎర్రటి సన్నని పూల దండ. )

రంగన్న: అయ్యగా రిప్పుడే అట్టా బయటి కెల్లారమ్మా! ( కుడి ద్వారంలోకి వెళ్ళిపోయాడు. )

సుందర్ : అదే ... మన బిల్డింగ్ విషయం మాట్లాడేందుకు ఇప్పుడే వెళ్ళారు. అరగంటలో వచ్చేస్తారు, కల్పనా!

కల్పన : ఏమిటి, బావా, రంగన్న చంపమంటున్నాడు?

సుందర్ : ( తెచ్చిపెట్టుకున్న నవ్వుతో విషయాన్ని మరుగుపరుస్తూ ) ఏదో పాపం! పెద్దవాడు వాళ్ళ కాలం నాటి కథ ఒకటి చెబుతున్నాడు.

కల్పన : ( తన చేతి వాచీ చూసుకుని ) మరైతే నాన్న వచ్చేందుకు ఎటూ టైం ఉందిగా! రంగన్న చెప్పిన కథ క్లుప్తంగా నువ్వు నాకు చెబుతావంట. అవునా, బావా!

సుందర్ : ఏదీ...అంతా చెబితేగా? మొదలుపెట్టాడు!.. ఇంతలో నువ్వొచ్చేశావ్!

కల్పన : పోనీ రంగన్ననే పిలుద్దాం! — కథంతా చెబుతాడు. రంగన్నా ... రంగన్నా! ...

**సుందర్ : అబ్బే ఎందుకూ! ... టూకీగా నేనే చెబుతాలే!**

**కల్పన : భలేవాడివి, బావా! అంతా నేనే . . . చెప్పబడు** తుందని అబద్ధమాడవు. **మీ రంగువాళ్ళని** నమ్మకూడదు! భలే దొంగలు **మీరు.**

**సుందర్ : ( ముఖంలో బాధ అలుముకున్నది. )**

కల్పన : ( అతని బాధను గ్రహించి ) క్షమించు, బావా! మరోలా అనుకోకు! శ్రీకృష్ణుడితో పోల్చి అన్నాను — అంతే. వెన్నముద్దలు దొంగిలించడంలో, గోపికల్ని అల్లరి చేయడంలో ఆ నీలమేఘశ్యాము డంతటి కొంటెవాడు మా బావ సుందర్! కదు, బావా?

సుందర్ : పాపం! నువ్వేనమ్మా తక్కువ తిన్నది. అందగత్తెగనే అహంతో సాక్షాత్తూ ఆ నీలమేఘశ్యాముణ్ణే కాలితో తన్నిన సత్యభామ అంతటి నెరజాణ మా కల్పన ... ( ఆమెను వారగా చూస్తూ ) అవును కదూ! ...

కల్పన : ఏమో బాబూ! తెలుగు సాహిత్యంలో నీతో పోటీకి రాలేను. . . . బాల సాహిత్యం వరకే పరిమితం నా తెలివి! కాబట్టి రంగన్న కథేమిటో చెప్పు వింటాను.

సుందర్ : అది కథ కాదు, కల్పనా! వాళ్ళ ఊళ్ళో నిజంగా ... పాపం! అయినా, ఎందుకులె ... వింటే బాధపడతావ్!

కల్పన : అబ్బ! చెప్పు, బావా! ... బాధపడను.

సుందర్ : సరే నీ ఇష్టం. వాళ్ళ ఊళ్ళో ఒక అమ్మాయి ఉండేదట. ఆమెకు చదువు, సంస్కారం, సంపద ఉన్నాయి. ఎంతో గుణవంతురాలు. కాని, భగవంతుని వింత చేష్ట ఏమిటంటే — ఆమె శరీరానికి ఇందాక నువ్వన్నావే... నీలమేఘశ్యాముడని అంతెందుకు — నా లాంటి రంగుని ప్రసాదించాడు.

కల్పన: ( ఉత్సుకతతో ) ఊఁ!. . .

సుందర్: మానవ సహజం కాబట్టి, ప్రాణికోటిలో ప్రేమించడం నేరం కాదు గాబట్టి. . . ఆ అమ్మాయి మనసారా ఓ అబ్బాయిని. . . బంగారు శరీరచ్ఛాయగల అబ్బాయిని ప్రాణప్రదంగా ప్రేమించింది. ఆ అబ్బాయికూడా ఆమె అంటే ఎంతో అభిమానంగా ఉండేవాడు. ఆమె అతన్నే సర్వంగా నమ్ముకుంది. కాని, పాపం ఆమె కోరికలన్నీ కన్నీటిపాయలుగా మారిపోయాయి. ఆ అబ్బాయి ఓ ఎర్రటి అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అంతే— ఆ రాత్రే ఆమె తన బ్రతుక్కి చీకటిని శాశ్వతం చేసుకుంది!

కల్పన: ( కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ) అంటే. . . ఆమె. . .

సుందర్: మనస్సు దోచుకున్న వాడు దూరంకాగా మరొకళ్ళ చేత తన మెళ్ళో మాంగల్యం కట్టించుకోలేక విషంతో తన కథను సమాప్తం చేసుకుంది!

కల్పన: పా... సర్వం **అర్పించుకున్న**

అమ్మాయిని వదిలి మరొకర్ని చేసుకునేందుకు అతని మనస్సెలా ఒప్పింది, బావా! ?

సుందర్: అదే! ఏ నాటినుంచో మానవ నిర్మాణంలో దాగున్న అంతుచిక్కని అగాధపు మనస్తత్వాలు.

కల్పన: మంచి మనస్సుతో నిండిన మానవత్వాన్ని అశాశ్వతమైన పైమెరుగులతో కొనగలమా, బావా?

సుందర్: (కళ్ళలో ఆశారేఖలు) ఎంతమంచి మనస్సు, కల్పనా, నీది. . .

కల్పన: నన్నెందుకు, బావా, పొగుడుతున్నావ్?

సుందర్: ఇది పొగడ్త కాదు! పసిడికి తావి అబ్బి నట్టుగా నీ రూపానికి తగ్గ విశాల హృదయం నీది. (ఫోను మోగింది. లోపల్నుంచి రంగన్న వచ్చాడు.)

సుందర్: (ఫోను అందుకుని) హలో!. . . ఆఁ. . . ఆఁ. . .నేనే, మామయ్యా, అలాగే. . . అలాగే! (ఫోను పెట్టేసి) మన బిల్డింగ్ అమ్మకం గురించి ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలట!. . . మామయ్య రమ్మన్నాడు. వెంటనే ఒక్క పది నిమిషాల్లో వచ్చేస్తాను. సరేనా?

కల్పన: త్వరగా రావాలి, బాబూ, మళ్ళీ ప్రోగ్రాం మిస్ అవుతుందేమో!

సుందర్: ఓ ఎస్! రంగన్నా, నా కారు. . .

రంగన్న: రెడీగానే ఉంది, బాబూ!

సుందర్: (అమితోత్సాహంతో, ఈల వేసుకుంటూ బయటికి వెళ్ళాడు.)

రంగన్న: సుందరబాబు దేవుడిలాంటోరు, తల్లీ!

కల్పన: అవును. . . మంచికి మారుపేరు సుందర్ బావ.

రంగన్న: బగమంతుడు మీకు మేలు సేత్తాడమ్మా!

కల్పన: (అతన్ని ఆదరంగా చూస్తూ) చూడు, రంగన్నా, చిరంజీవిగారికి కాఫీ తీసుకెళ్ళు! ఇంతలో నేను ఉత్తరం పూర్తి చేస్తాను. పాపం శారద రాసి వారం దాటింది!

రంగన్న: అట్టాగేనమ్మా!

కల్పన: (లోనికెళ్ళింది.)

రంగన్న: (కుడి ద్వారంలోకి వెళ్ళాడు.)

చిరంజీవి: (ఏదో పుస్తకం పేజీలు తిరగేస్తూ మెట్లు దిగుతున్నాడు. ఎదురుగా టేబులుమీదున్న పూలకుండీలోని ఎర్రటి పూలను చూచి, కలవరపాటుతో చేతిలోని పుస్తకాన్ని వదిలే శాడు. టేబులు దగ్గరగా వెళ్ళి ఆ పూల వంక భయం భయంగా చూస్తున్నాడు.)

రంగన్న: (కాఫీ కప్పుతో వచ్చి, చిరంజీవిని చూసి) తమరే వచ్చారే. . .

చిరంజీవి: (భయాన్ని అణచుకుంటూ, రంగన్న వేపు చూశాడు.)

రంగన్న: కాఫీ తీసుకోండి, బాబూ!

చిరంజీవి: అలాగే. అక్కడ పెట్టు. తీసుకుంటా! (రంగన్న కాఫీ కప్పును టీపాయ్‌మీద పెట్టాడు.) రంగన్నా!

రంగన్న: బాబూ. . .

చిరంజీవి: (బల్లమీది ఎర్రటి పూలను చూపుతూ) ఆ పూలు. . .

రంగన్న: మన తోటలోయే, బాబూ!

చిరంజీవి: వేరే రంగుల్లేవా?

రంగన్న: ఎందుకు లేవు, బాబూ? అమ్మాయిగారికి ఈ పూలంటే ఇష్టం, బాబూ!

చిరంజీవి: ఇంతకుముందు ఎప్పుడూ లేనిది ఈ ఈ వేళే ఎందుకు పెట్టావ్?

రంగన్న: ఆ చెట్లు ఇప్పుడిప్పుడే మొగ్గలు తొడికి పూస్తున్నాయి. ఎందుకు, బాబూ, అట్టా అడుగుతుండారు?

చిరంజీవి: అహఁ ఏమీలేదు. వేరే రంగుల్లేవా అని ఊరికే అడిగాను. నువ్వేమీ అనుకో నంటే వాటిని అవతల పారేస్తాను.

రంగన్న: అదేంటి, బాబూ?

చిరంజీవి: అవును, రంగన్నా! నా చిన్నతనంలో ఒక కుక్క పిల్ల కారుకింద పడి చచ్చిపోవటం చూశాను. చుట్టూ ఎర్రగా నెత్తురు, మడుగు! ఆ నెత్తురు చూడగానే మూర్ఛతో తెలివి తప్పి పడిపోయాను. అంతే. . . ఆ నాటి నుంచి ఎరుపురంగు చూస్తే నా కేదో భయంగా ఉంటుంది.

రంగన్న: అట్టాగైతే, అమ్మాయితో చెప్పి ఇక ఎర్రటిపూలు పెట్టనీనే, బాబూ! వీటిని బయట పారేసి వస్తాను. (ఆ పూలను వీథిలో పారేసి వచ్చాడు.)

చిరంజీవి: నువ్వు చాలా మంచివాడివి, రంగన్నా!

రంగన్న: అందరూ సల్లగా ఉంటే నా కంతే సాలు, బాబూ! అన్నట్టు కాఫీ తీసుకోండి— సల్లారి పోద్ది!

చిరంజీవి: అలాగే. (కాఫీ తాగుతూ) రంగన్నా! చెట్టునుంచి పూలను తుంచుతుంటే వాటి కప్పుడు బాధ కలగదూ?

రంగన్న: ఎందుక్కలగదు, బాబూ, వాటికీ పాణం ఉందిగా!

చిరంజీవి: (చేతిలోని కప్పును టీపాయ్‌మీద పెట్టి, ఎక్కడోచూస్తూ దేన్నో గుర్తు చేసుకుంటూ) అవును. ప్రాణం ఉంది! ప్రాణం. . . ఉంది! అల్లిబిల్లిగా మలుపులు తిరిగిన లతల్లో వికసించి జాబిల్లిలా చల్లని నవ్వులు వెదజల్లే ఆ సుకుమార కుసుమానికి ముందున్న ఆపద ఎలా తెలుస్తుంది? దానిని నిలువునా తొడిమతో సహా తుంచి వేయడానికి ఓ కబంధహస్తం పొంచి ఉందని దాని కెలా తెలుస్తుంది? నీల పవన వీచికల్లో పిచ్చిగా తేలిపోతున్న ఆ పూబాల కుత్తుక కత్తిరిస్తే— ఆ క్షణంలో విల విల్లాడుతూ, మృత్యువులో కలిసే దాని మూగ రోదన ఆ కర్కశ హృదయుడికి వినిపించదు! మానవత్వానికి ముసుగు కప్పిన పిరికితనం, స్వార్థం వాణ్ణి దానవుడిగా మార్చాయి! (అధిగమించిన ఆవేశం, ఆవేదనలతో ఇక మాట్లాడలేకపోతాడు.)

రంగన్న: అంత బాధపడతా రెందుకు, బాబూ! ముస్టిలో ఏటి పని వాటికుంది. ఏటినీ సంపగూడదంటే ఇక మనిసి బతుకే ఉండదు.

చిరంజీవి: మనిషిని క్షణ క్షణం చంపుతుంది పిరికితనం! ఆ పిరికితనాన్ని చంపాలంటే మనిషే బత కూడదు!. . . బతకూడదు!


రంగన్న: ఏదో పెద్దవాణ్ణి సెబుతుండా— తమరిట్టా మనసు కష్టపెట్టుకోవటం మీ ఆరోగ్యానికి మంచిది కాదు. పెద్దయ్యగారికి తెలిస్తే వారు శానా బాధ పడతారు, బాబూ!


చిరంజీవి: (కలవరపాటుతో) అవును. వారికి. . . తెలిస్తే! (నిబ్బరంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ) దేవతలాంటి అమ్మను పోగొట్టుకున్న మందభాగ్యుణ్ణి! చిరంజీవిగా మిగిలాను!

రంగన్న: మనం ఎంత గుండె బాదుకున్నా పోయిన వాళ్ళు తిరిగొస్తారా, బాబూ!

చిరంజీవి: రాదు. . . ఎప్పటికీ తిరిగి రాదు! (నిస్సత్తువ, నిస్సహాయత ఆవరించగా సోఫాలో చేరగిలపడి పోతాడు.)

రంగన్న: అన్నీ మరిసి తమరు సంతోసంగా ఉండాల, బాబూ!






## ఏరు నిరు

చిత్రం—ఎ. కె. ప్రసాద్ (విజయవాడ)

కల్పన: (గదిలోనుంచి వస్తూ) రంగన్నా! ఈ లెటర్ పోస్ట్ చేసిరా!

రంగన్న: (ఉత్తరం తీసుకుని) అట్టాగేనమ్మా! (వీధిలోకి వెళ్ళాడు.)

కల్పన: (ఇప్పుడు చిరంజీవిని చూసింది.) ఓ... మీ... రా!

చిరంజీవి: (ఆమెను చూశాడు తన నెవరో ఛెళ్ళున కొట్టినట్లనిపించింది. ఆమెను ఆపాదమస్తకం కంపించిపోతూ చూశాడు. లేస్తూ పెద్దగా అరిచాడు.) స... ర... ళా! !

కల్పన: (జడుసుకుంది. అయోమయంగా వెనక్కి జరుగుతూ) ఏమి. . .టండీ!

చిరంజీవి: ఆఁ. . .అహఁ. . .ఏమీ. . . ఏమీలేదు...

కల్పన: మీ రిప్పుడు 'సరళా' అని అరిచారు! ఎవరండీ ఆ సరళ?!

చిరంజీవి: (గద్గదస్వరంతో) క్షమించండి!. . . నేను అశక్తుణ్ణి!. . .

కల్పన: బాధపడక దయచేసి చెప్పండి. . .

చిరంజీవి: (ఆమెను చూడకుండానే) నేను ఎరుపు రంగంటే. . . భయపడిపోతాను!. . . మీరు కట్టుకున్న బట్టలు. . .

కల్పన: (ఆశ్చర్యంతో) ఈ రంగంటే నాకు చాలా ఇష్టమండీ!. . . రెండు నెలల క్రితం వీటి కోసం ఆర్డరిస్తే ఆ షాపువాళ్ళు ఈ వేళ పంపించారు. పోనీండి. . . ఈ రంగంటే మీకు గిట్టనప్పుడు. . . వేరే మార్చుకొస్తా మండండీ!

చిరంజీవి: అహహ!. . . అక్కర్లేదండి. . . క్షమించండి . . . కాస్సేపు అలా గదిలో పడుకుంటాను! మనస్సంతా అదోలా ఉంది! (మేడ మీదికి వెళ్ళబోతాడు.)

(ఫోను మోగింది.)

కల్పన: (ఫోను అందుకున్నది.) ఎస్. ట్రంకాల్! . . . ఎవరు కావాలి? మోహన్? !. . .

చిరంజీవి: (ఆత్రతగా వెనక్కి తిరిగి వచ్చి, ఆమె చేతి లోని రిసీవర్ని అందుకుంటూ) ఇలా ఇవ్వండి. నాన్నగారే అయి ఉంటారు! (ఫోన్లో) హలో!. . . నేనే నాన్నా!. . . అవును మోహన్నే! ఆఁ. . . కులాసాయే, నాన్నా! నా ఆరోగ్యం బాగుంది. ఏమిటి? మీరు రేపే వస్తున్నారా?. . . సరే. నాన్నా. . . అలాగే! . . . ఉంటా, నాన్నా! (ఫోను పెట్టేశాడు. అక్కడినుంచి త్వరత్వరగా తిరిగి మేడమీదికి వెళ్ళబోతాడు.)

కల్పన: (అతన్ని ఆశ్చర్యంగా చూస్తూ) మోహన్ అంటున్నారేమిటి?

చిరంజీవి: (తక్కువ ఆగిపోయి, బలవంతంగా నవ్వుతూ) ఓ. . . అదా!. . . అదీ మా నాన్నగారు నన్ను పిలిచే ముద్దు పేరు!. . .

కల్పన: (చిలిపిగా నవ్వుతూ) మొత్తం కలిపితే . . . చిరంజీవి మోహన్‌గారు మీరు: అవునాండీ?.

చిరంజీవి: అవునవును. అంతే . . . (వెళ్ళబోతాడు.)

కల్పన: అబ్బ. . . ఇలారండి. . . సరదాగా కాస్సేపు మాట్లాడుకుందాం:

చిరంజీవి: (ఇక తప్పదన్నట్టుగా వచ్చేస్తాడు. కాని, ఆమెను చూడటానికి జంకుతూనే ఉంటాడు.)

కల్పన: అయితే, మీ నాన్నగారు వచ్చాక ఇక మాతో పలకరు కాబోలు.

చిరంజీవి: అదేమిటండీ అలా అంటారు. చేసిన మేలు మరిచేటంతటి కృతఘ్నుణ్ణిగాను!

కల్పన: ఊరికే నవ్వులాట కన్నాను. కాని, మీరు దయచేసి నన్ను "మీరు, అండీ" అని పిలవకండి.

చిరంజీవి: అలా పిలవకపోతే ఇతరుల్ని అగౌరవపరచడ మౌతుంది, కల్పనగారూ!

కల్పన: అదుగో మళ్ళీ!. . . ప్లీజ్!. . . పోనీ నా పేరు చెప్పండి!

చిరంజీవి: కల్పనగారు!

కల్పన: ఆ "గారు" తీసేసి చెప్పండి—చూద్దాం!

చిరంజీవి: కల్పన!

కల్పన: ఏదీ. . . మరొక్కసారి. . .

చిరంజీవి: క. . .ల్ప. . .న! ! !

కల్పన: (అతని కళ్ళలోకి మత్తుగా చూస్తూ) మీ రలా పిలుస్తుంటే పదేపదే వినాలనిపిస్తోంది!

చిరంజీవి: నా కేమిటో అర్థం కాకుండా మాట్లాడుతున్నారు.

కల్పన: ఈ అచిరకాలంలోనే నన్ను నేనే మరిచిపోయే టంతగా మరొకరిలో ఒదిగిపోయాను!. . . కాని, స్త్రీని. . . అందుకే పెదవి కదపలేక, మీకు అర్థమయ్యేలా చెప్పలేక ఇన్నాళ్ళనుంచి సతమతమౌతున్నాను. . .

చిరంజీవి: ఏ విషయం. . .

కల్పన: (తాదాత్మ్యం చెందుతూ) మానవాతీతమైన ఏదో శక్తి నన్ను ఉద్వేగపరుస్తుంటే, మానవ సహజమైన సిగ్గుతో దాన్ని అడ్డు పరచడం అవివేకమౌతుంది కదూ!

చిరంజీవి: అ. . . వు. . .ను!

కల్పన: అవునుకదూ! అందుకు మీరూ ఒప్పుకున్నారు! . . .ఇన్నాళ్ళబట్టీ ఎప్పటికప్పుడు చెప్పాలను కుంటున్నా ఏమని చెప్పాలో, ఎలా చెప్పాలో . . .

చిరంజీవి: మీరు చెప్పలేకున్నా, మీ మనసులోని మాట ఇప్పుడిప్పుడే నాకు వినిపిస్తూ ఉంది.

కల్పన: (సిగ్గుపడిపోతూ) కృతజ్ఞురాల్ని. . .

చిరంజీవి: కాని. . .

కల్పన: ఊఁ. . . చెప్పండి!

చిరంజీవి: అందుకు నేను అనర్హుణ్ణి!

కల్పన: (కలతపడి) కానీ. . . నేను కోరుకుంటున్న అర్హతలు మీలో ఉన్నాయంటే మీ రేమంటారు?

చిరంజీవి: ఏమీ అనలేను. . .

కల్పన: ఏమీ అనలేనప్పుడు నా లోని మీరు నన్ను వేరుగా చూడగలరా?

చిరంజీవి: క్షమించండి!. . . దయచేసి నన్ను ఇరుకున పెట్టకండి!

కల్పన: మీకు కష్టం కలిగిస్తున్నానా?. . . మీ రనేది నాకు అర్థం కావడం లేదు.

చిరంజీవి: నా స్వార్థం మరొకళ్ళకి అన్యాయం కాకూడదు.

కల్పన: మరొకళ్ళా? ! అంటే?

చిరంజీవి: తెలిసి తెలిసి సుందర్‌కి అన్యాయం చెయ్యలేను!

కల్పన: సుందర్‌కా?

చిరంజీవి: మీ ఇద్దరికి ఏనాడో వివాహం నిశ్చయమైంది.

కల్పన: (కోపంతో) అని ఎవ రన్నారు?

చిరంజీవి: మరణించబోతున్న సుందర్ తల్లిగారికి మీ నాన్నగారు ప్రమాణం చేశారు— మీ ఇద్దరికీ వివాహం చేస్తామని...

కల్పన: (బాధ, కోపం) ఏమండీ! ఇలాంటివి కల్పించి మీ అయిష్టాన్ని తెలుపుతున్నారు— చాలా సంతోషం!

చిరంజీవి: తొందరపడకండి. ఇందులో కల్పనకి తావు లేదు! మొన్న రంగన్న నాతో చెప్పిన వాస్తవాన్ని చెప్పానంతే!

కల్పన: (ఒక్క క్షణం నిశ్శబ్దం) క్షమించండి! మిమ్మల్ని అపార్థం చేసుకోను కాని, నన్ను అర్థం చేసుకోండి!

చిరంజీవి: (ఏమిటన్నట్టు ఆమెను చూశాడు.)

కల్పన: అలాంటి కోరిక వారికున్నట్టు నాకు తెలియదు! మా నాన్నగారెప్పుడూ ఈ విషయాన్ని నాతో అనలేదు!... అయినా, వారి హృదయం నాకు తెలుసు—నాకు ఇష్టంలేని పని వారెప్పుడూ చెయ్యరు!

చిరంజీవి: కాని, మన మంచిని కోరే పెద్దవారిని తృణీకరించడం...

కల్పన: అదే చెబుతున్నానండీ... నా మంచిని కోరే మా నాన్న—అన్నలాంటి సుందర్‌తో నాకు...

చిరంజీవి: కల్పనగాదూ!

కల్పన: ఇది కల్పన గాదు! నగ్నసత్యం! సుందర్ వరసకి నాకు బావ కాని, నా హృదయంలో అతనికి అన్నయ్యగా మాత్రమే స్థానముంది! అతన్ని అన్నగానే అభిమానిస్తున్నాను, అన్నగానే ప్రేమిస్తున్నాను!

చిరంజీవి: అయితే, సుందర్...

కల్పన: చెల్లెల్ని ఇల్లాలిగా చేసుకునే మూర్ఖుడు కాదు!

చిరంజీవి: కేవలం మన నిర్ణయాలతో...

కల్పన: నాకు కావలసింది మీ నిర్ణయం. (కంఠం రుద్ధమైంది) మీ లోని నన్ను వేరు చేసినా, నాలోని మీరు ఎన్నటికీ చెరిగిపోరు. (వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ విసురుగా లోనికి వెళ్ళబోయింది.)

చిరంజీవి: (ఆశ్చర్యంగా, ఆత్రతతో వెళ్ళి ఆమెకు అడ్డంగా నిలిచి) కల్పనా!... క్షమించు. నిన్ను కష్టపెట్టాలని గాని, నీ కంటతడి చూడాలని గాని నా ఉద్దేశ్యం కాదు! నీ లోని నేను ఎన్నటికీ వేరుగాను!... సరేనా!

కల్పన: (మొదట నమ్మలేనట్టుగా, తరవాత వింతగా, ఆటుపైన ఆనందం, సిగ్గులతో ఉక్కిరి బిక్కిరి అవుతూ) ఇందుకే... ఈ ఒక్క మాట కోసమే ఇన్నాళ్ళూ ఎదురు చూశాను. ఈ విషయం మా నాన్నగారితో నేనే చెబుతాను.

చిరంజీవి: అన్నట్టు మా నాన్నగారుకూడా వస్తున్నారుగా —ఇక ఈ బాధ్యత పెద్దలికే వదిలేద్దాం!

కల్పన: (ఇప్పుడు అతన్ని సూటిగా చూడలేకపోయింది. దిక్కులు చూస్తూ సిగ్గుతో) ఏమీ తెలియనట్లు నటించి అంతా నా చేతనే చెప్పించిన మీ నేర్పరితనం...

చిరంజీవి: నాలో ఎంత నేర్పున్నా గెలుపు మీదే!

కల్పన: అదుగో మళ్ళీ "మీరు అండీ"...

చిరంజీవి: (ఒక్క క్షణం అర్థం కానట్టు చూచి వెంటనే గ్రహించి) ఓ!... "మీరు" కాదు "నువ్వు!"

కల్పన: (ఆనందోత్సాహంతో) ఈ ఆనందసమయంలో అలా తోటలో పిచ్చిగా పరుగులెత్తి గంతులేయమంటోంది నా మనసు! (బయటకు చూపుతూ) చూశారా!

చిరంజీవి: (ఆమె దగ్గరగా వచ్చి బయటకు చూస్తాడు.)

కల్పన: (పరవశించి పోతూ) కాషాయరంగు పులుముకుంటున్న ఆకాశం, కుంకుమ శోభలతో అలరారుతున్న గులాబీగుత్తులు, వాటి ప్రతిబింబాలతో నిండిన చెరువు— ఎర్రగా వసంతంలా...

చిరంజీవి: (వెర్రిగా అరిచాడు) కల్పనా!...

కల్పన: (స్తంభించిపోయింది.)

చిరంజీవి: భగవాన్! (సోఫాలో కూలబడ్డాడు.)

కల్పన: (భయపడిపోతూ) ఏమండీ!... ఏం జరిగిందండీ?

చిరంజీవి: (ముఖం వికృతంగా మారింది. వణికిపోతున్నాడు.) దేన్ని మరిచిపోదామని ఇంత దూరం వచ్చానో అదే ఎదురవుతూంది!

కల్పన: అసలు ఏం జరిగిందో చెప్పండి!... నా కేమిటో భయంగా ఉంది!

చిరంజీవి: ఇలాగే... చెరువు... అదేరంగు... ఇదే సమయం...

కల్పన: (బతిమలాడుతూ) ఇలా చూడండి... ఒక్కసారి నా వంక చూడండి!

చిరంజీవి: (పిచ్చివాడిలా చూశాడు.)


కల్పన: నాతో చెప్పరూ?

చిరంజీవి: (నిస్సహాయంగా) ఏమీలేదు!

కల్పన: కాదు, మీరేదో దాస్తున్నారు! ఇందాక నా బట్టలు చూసి భయపడ్డారు. ఇప్పుడు ఆ చెరువు చూసి భయపడ్డారు! అసలు మీ భయానికి కారణం ఏమిటో చెప్పండి! లేకుంటే నా మీద ఒట్టే! ప్లీజ్!

చిరంజీవి: (శక్తినంతా కూడదీసుకుని లేస్తూ) మరణించినా దాగని రహస్యం... చెబుతాను! (రెండు మూడు క్షణాలు కళ్ళు మూసుకున్నాడు. గతాన్ని గుర్తు చేసుకుంటూ) మధు, పద్మ, నేను ప్రాణస్నేహితులం! చిన్నప్పటినుంచి ఒక చోట పెరిగి ఒకే చోట చదువుకున్నాం! మధు, పద్మ ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకున్నారు! క్షణికోద్రేకానికి గురయ్యారు!... పద్మ బిడ్డతల్లి కాబోతూంది! మధు ముఖం తప్పించాడు. పద్మ బావురుమన్నది. మధుని మందలించాను! ఆఖరికి బెదిరించాను. పద్మను చేసుకుంటే వాళ్ళ కుటుంబగౌరవం నాశనమౌతుందని, వర్ణాంతర వివాహానికి వాళ్ళ నాన్న అంగీకరించటం లేదని ఖచ్చితంగా చెప్పాడు! పద్మకు అన్యాయం జరిగితే "నిన్నూ, మీ నాన్ననూ, మీ కుటుంబాన్నీ రచ్చ కీడుస్తా"నని భయపెట్టాను! ఆలోచించి మరునాడు చెబుతానన్నాడు. నేను నమ్మాను. ఆ సాయంత్రం— ఇదే సమయం... పద్మకు కబురంపాడు— ఊరవతల చెరువు దగ్గర తోటతోపులో ఉనని కలుసుకోమని! అమాయకురాలు— ఆనందంగా పరుగు తీసింది! పద్మకు ధైర్యం చెబుదామని వాళ్ళింటి కెళ్ళాను! మధు పంపిన చీటి పద్మ టేబులుమీద కనిపించింది ...! నా కెందుకో అనుమానం వేసింది!...

(తరువాయి 53 వ పేజీలో)



# కన్నీటి మెరుపులు

( 23 వ పేజీ తరువాయి )

పరుగు తీశాను! నా అనుమానం నిజమైంది! అక్కడ ఎవ్వరూ లేరు! చుట్టూ వెతికాను. చెరువు వైపు చూశాను! చెరువంతా. . . ఎర్రగా. . . నెత్తురుతో కలిసిపోయి ఉంది! ... నా గుండె పగిలిపోయింది. . . నీళ్ళమీద పద్మ శవం. . . రక్తం. ఎటు చూసినా ఎర్రగా రక్తం. . . రక్తం. ( అపస్మారకంగా గొణుగుతున్నాడు. )

కల్పన: (అతని దగ్గరగా వెళ్ళి, భుజాలు పొదివి పట్టుకొని సోఫాలో కూర్చోబెట్టింది. )

చిరంజీవి: అంతే... ఆ నాటి నుంచి ఎర్రటి రంగు చూస్తే నాకా భయంకర దృశ్యం గుర్తు కొస్తుంది.

కల్పన: మరి అతనేమయ్యాడు?

చిరంజీవి: ఎక్కడో ... ఆ తరవాత కలరా జబ్బుతో చచ్చాడని తెలిసింది.

కల్పన: పోనివ్వండి... అదొక పీడకల అనుకోండి.

చిరంజీవి: ( లేస్తూ ) అవును. . . అంతే! . . . ఆ పీడకల కరిగిపోయింది! ఇక నాకే భయమూ లేదు! నీతో చెప్పేశాగా?

కల్పన: ( అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటుంది. అదే సమయంలో బయటినుంచి సుందర్ వచ్చి వారిద్దర్నీ చూశాడు. వెంటనే సుందర్ వెనక్కు తప్పుకుంటాడు. ) ఇలా నా కళ్ళలోకి చూడండి! అవన్నీ మరిచిపోండి! కంటికి రెప్పలా మిమ్మల్ని చూసుకుంటాను.

చిరంజీవి: (బయట నిలబడి ఉన్న సుందర్ కనిపించాడు. కల్పన చేతుల్లోంచి తన చేతిని తీసుకొని ) ఓ!... సుందర్‌గారూ!... రండి... రండి! మీ కోసమే ఎదురు చూస్తున్నాం.

కల్పన: ( చిరునవ్వుతో ) అవును, బావా!

సుందర్: ( వాడిగా, క్రూరంగా ఇద్దర్నీ చూస్తూ, ఒక్కొక్క అడుగు బరువుగా వేస్తూ వాళ్ళ దగ్గరగా వచ్చాడు. ఆవేశం, ఆవేదన పెనవేసుకున్నాయి. తళుక్కున ఒక్క చిరుహాసరేఖ పెదవులమీద మెరిసింది. ఏమీ లేనట్టుగా, అసలేమీ జరగనట్టుగా హాయిగా తన గదిలోకి వెళ్ళాడు. )

చిరంజీవి: ఏమిటలా ఉన్నాడు?

కల్పన: అదే నాకూ అర్థం కావడం లేదు! బావని ఇలాంటి స్థితిలో ఎప్పుడూ చూడలేదు!

( ఇంతలో బయటినుంచి బంగారయ్య వచ్చాడు.)

కల్పన: ఎవరు మీరు?

బంగారయ్య: నా పేరు బంగారయ్య! గంగాధరంగారి ఇల్లు ఇదేనా, అమ్మా?

కల్పన: అవును. ఎందుకు?

బంగారయ్య: జగన్నాధంగారు పంపించారు నన్ను. వారబ్బాయిగారుకూడా ఇక్కడే ఉన్నారట!

చిరంజీవి: మా నాన్నగారు పంపించారా? !

బంగారయ్య: అవును, బాబూ, నన్ను పంపిస్తున్నట్టు మీకు ఫోను చేస్తామన్నారు?

చిరంజీవి: ఫోను చేశారు!. . . కాని, మీ విషయం చెప్పలేదే! బహుశా మరిచిపోయుంటారు!

బంగారయ్య: అంతే, బాబూ! మీ నాన్నగారూ, నేనూ చిన్ననాటి స్నేహితులం.

కల్పన: నిలబడే ఉన్నారు — కూర్చోండి!

బంగారయ్య: అలాగేనమ్మా! ( కూర్చున్నాడు. )

కల్పన: రంగన్నా!. . . ఓ... లెటర్ పోస్ట్ చెయ్యమన్నాను గదూ!. . . ఉండండి. . . ఒక్క నిమిషంలో వస్తాను! ( కుడి ద్వారంలోకి వెళ్ళింది. )

బంగారయ్య: మోహన్‌బాబు!. . .


చిరంజీవి: ( కంగారుపడ్డాడు. )

బంగారయ్య: ( చిరునవ్వుతో ) మీ ఆరోగ్యం ఎలా ఉంది?

చిరంజీవి: నా పేరు?

బంగారయ్య: నాన్నగారు చెప్పారు, బాబు! ( జేబులో నుండి ఒక చీటి తీసి ) ఇదేమిటో చూడు, బాబూ!

చిరంజీవి: ( చీటి అందుకొని, అందులో విషయాన్ని కళ్ళతో చదివాడు. నిలువునా కుంగిపోయాడు. తమాయించుకుని, వెర్రిగా ) ఎవరు నువ్వు?




కల్పన: ( కాఫీతో వచ్చి ) ఏమిటండీ అది?

బంగారయ్య: ( చిరంజీవి చేతిలోని చీటి తీసి ఆమె కిచ్చి ) ఆ చీటి చదివి దాని అర్థమేమిటో ఆ బాబుకి నువ్వైనా చెప్పమ్మా!

కల్పన: ( చీటి అందుకుని చదువుకుంది. ) "పరశా! ఊరవతల చెరువు దగ్గర తాటితోపులో సాయంత్రం నన్ను కలుసుకో — నీ మోహన్." ( ఆమె కేమీ అర్థంకాక వాళ్ళిద్దర్నీ "ఏమిటిది" అన్నట్టుగా చూస్తుంది. )

చిరంజీవి: ( ఆమె చేతిలోని చీటి లాక్కుని, దాన్ని చించి ముక్కలు చేసి ) ఏమిటి దీని అర్థం? ఎవరు నువ్వు? అసలు ఎవరీ మోహన్?

బంగారయ్య: మొండిగా మాట్లాడకు! మద్రాసులో వ్యాపారి జగన్నాధంగారి ఏకైక పుత్రుడు ఈ మోహన్! తన కొడుకు కలరా జబ్బుతో చచ్చిపోయినట్టు తప్పుడు రికార్డు సృష్టింపచేసిన జగన్నాధంగారి చిరంజీవే ఈ మోహన్! అర్థమైందా? చెరువు గట్టున మాకు దొరికిన ఆ చీటే ఈ కేసుకి ఆధారం ఇచ్చింది. ( చిరునవ్వుతో ) ఇప్పుడు నువ్వు చించింది ఆ చీటి నకలు మాత్రమే!

కల్పన: ఏమిటండీ ఇది?. . . నా కంతా అయోమయంగా ఉంది!

బంగారయ్య: కొంచెం ఓపిక పట్టండమ్మా. . . అంతా అర్థమవుతుంది!

చిరంజీవి: ( పిడికిళ్ళు బిగించి, క్రూరంగా చూస్తూ బంగారయ్య మీదికి ఉరకబోతూ ) నీ ప్రాణాలు తీస్తాను!

బంగారయ్య: ( చేతిసంచిలోంచి రివాల్వర్ తీసి ) అక్కడే నిలబడు! ప్రాణాలు తీసే నీలాంటి వాళ్ళను గాలించమనే ప్రభుత్వం నన్ను నియమించింది. ( జేబులోంచి విజిటింగ్ కార్డు చూపించి ) ఇదేమిటో చదువు!

చిరంజీవి: ప్రభాకర్!... సి. ఐ. డి. . .

ప్రభాకర్: ( మీసాలు తీసేసి ) ఆట్టే కష్టపడకుండా దొరికావు—కృతజ్ఞుణ్ణి. నీ అసలు పేరు నీ తోనే చెప్పించాను! ఇందాక ఫోను చేసింది మీ నాన్న కాదు, నేనే!

కల్పన: ( ఆశ్చర్యంగా చూసింది. )

చిరంజీవి: ఇందులో నా కేలాంటి సంబంధమూ లేదు! ఇదంతా కల్పితం!

ప్రభాకర్: ఇదుగో మీ నాన్న నీకు రాసిన ఉత్తరం! ( కవరు తీసి ) నువ్వు చచ్చిపోయినట్టు పుకార్లు పుట్టించినా, ఆ చీటి దొరికింది మొదలు మాకు అనుమానంగానే ఉంది. అందుకే మీ ఇంటి నుంచి వచ్చే ప్రతి ఉత్తరాన్ని పరిశీలించాం! ఇదుగో దీనిమీద చిరంజీవి, కేరాఫ్ శ్రీ గంగాధరం. . . సరే, మీ నాన్న నీకు రాసింది! నువ్వే చదువు, ( ఉత్తరం చిరంజీవికిచ్చాడు. )



వేకువ

ఫోటో — ఆర్. ఉదయభాస్కర్ (తిరుపతి)

చిరంజీవి: (యాంత్రికంగా ఉత్తరం అందుకుని చదువుకుంటాడు. ఉత్తరాన్ని మరో కంఠం నేపథ్యంలో చదివితే బాగుంటుంది.)

"నాయనా మోహన్!

దిగులుపడకు. పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయి కాని, ప్రతి క్షణం గుండెలు పగిలేలా ఏడుస్తున్నాను. మీ అమ్మ మనకు దూరమై రెండు నెలలుకూడా కాలేదు. మళ్ళీ ఇదొకటి వచ్చి పడింది. కొడుకు ఉండీ చచ్చినట్టు చాటుకోవలసి వచ్చింది. భగవంతుడు దయ తలిస్తే నేనే అక్కడికి వచ్చేస్తాను. అక్కడ ఎవరికీ ఎలాంటి అనుమానమూ కలగకుండా ప్రవర్తించు. వీథుల్లో అసలు తిరగకు.

ఇట్లు
దురదృష్టవంతుడు
మీ నాన్న
జగన్నాథం."

బంగారయ్య: (చిరంజీవి చేతిలోని ఉత్తరం తీసుకున్నాడు.)

చిరంజీవి: మీరు నన్ను మోసగించా లనుకుంటున్నారు! సరళ ఎవరో నాకు తెలియదు. నా పేరు మోహన్ కాదు!. . . అసలు నాకు నాన్నే లేడు!

బంగారయ్య: (నవ్వి) ఈ ఉత్తరం మా చేతికి చిక్కిన మరుక్షణమే మీ నాన్నను అరెస్టు చేశాం. కాదని మీరు ఇద్దరూ కోర్టులో నిరూపించుకోండి!

చిరంజీవి: (ఇక మాట్లాడలేకపోతాడు.)

సుందర్: (మధ్య ద్వారంలో నిలబడి) అంతా విన్నాను. అనవసరంగా ఎంత శ్రమ పడ్డారు ఇన్స్పెక్టర్ గారూ! (వాళ్ళ దగ్గరగా వచ్చి) జైలుకి నడవవలసింది మతిలేని సుందర్ కాదు! నేను! (తన్ను తాను చూపుకుంటూ) ఈ మోహన్! సరళను హత్య చేసిన ఈ మోహన్!

ప్రభాకర్: (సుందర్ని దీక్షగా చూస్తున్నాడు.)

సుందర్: అలా చూస్తారేం? అతను గంగాధరంగారి మేనల్లుడు. సుందర్! అతనికి మతిభ్రమ! పిచ్చాడితో ఆడుకుంటారేం ఇన్స్పెక్టర్! . . . కల్పనగారూ! మీరైనా చెప్పకూడదూ? నన్ను రక్షించేందుకు పాపం, మతి లేని సుందర్ని పట్టేస్తున్నారన్నమాట!

ప్రభాకర్: అంటే?. . .

సుందర్: నే నేమోహన్ని! మీరు ఇంత కాలం ఎవరి కోసం గాలిస్తున్నారో ఆ మోహన్ని నేనే! చిరంజీవిగా తల దాచుకుంటున్న మోహన్ని, జగన్నాథంగారి కుమారుణ్ణి నేనే! నేనే సరళను హత్య చేశాను! సరేనా?. . . రండి, వెళదాం . . . క్షమించండి ఒక్క క్షణం! (కల్పన దగ్గరగా వచ్చి) ఇన్నాళ్ళూ మీరు నాక్కు చూపిన అభిమానానికి కృతజ్ఞుణ్ణి! (అక్కణ్ణుంచి ఇన్స్పెక్టర్ వద్దకు రాబోయాడు. తూలిపడబోయాడు. వెంటనే ప్రభాకర్ పట్టుకున్నాడు. సుందర్ నోటివెంట నురుగు పడుతుంది.)

ప్రభాకర్: (సుందర్ని సోఫాలో కూర్చోబెట్టి) ఏమండీ ఏమైంది?

సుందర్: (చేతిలోనుండి ఒక చిన్న సీసా జారి కింద పడింది.)

ప్రభాకర్: (సీసా తీసి చూసి) అరె!. . . విషం! (వెంటనే ఫోను వద్ద కెళ్ళి, ఫోను చేసి) హలో, డాక్టర్! నేను సి. ఐ. డి. ఇన్స్పెక్టర్ ప్రభాకర్ని!. . . దయచేసి మీరు వెంటనే గంగాధరంగారి ఇంటికి రావాలి!. . . చాలా సీరియస్!. . . థాంక్స్! (ఫోను పెట్టి) సుందర్గారూ! ఒక అయోగ్యుణ్ణి రక్షించేందుకు మీరు చేసిన త్యాగానికి విలువ లేదు! ఎంత పని చేశారు?!

సుందర్: విచారించకండి, ఇన్స్పెక్టర్! ... చాలా కాలం . . . నా ప్రాణప్రదంగా దాచుకున్న ఈ చిన్నిసీసా. . . ఈ నాడు నాకు స్వర్గద్వారాలను తెరుస్తోంది!

కల్పన: (అప్పటివరకు శిలలా నిలబడి పోయింది.) బావా!... బావా!... ఎందు కింత అన్యాయం చేశావు, బావా? (కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది.)

సుందర్: (ఆమె కన్నీటిని, తన చూపుడు వేలితో తుడుస్తూ) కన్నీటిని వృధా చేయకు, కల్పనా! . . . ఈ సువిశాల విశ్వంలో మానవ సంతతికి ఎన్నటికీ తరగని అమూల్య సంపద ఈ కన్నీరొక్కటే!. . . ఈ కన్నీటి మెరుపులే మానవ జీవిత ప్రతిబింబాలు!

కల్పన: బావా! (ఏడ్చేస్తూ) నీ కేం కష్టం కలిగిందని ఇంత పని చేశావు, బావా!

సుందర్: (చిరు నగవు మోముతో) నిండు పూర్ణిమ వెలుగులు పరుచుకుంటున్న కొందరి జీవితాల్లో కారుమేఘం లాంటి నా [illegible] చీకట్లను [illegible] సహించలేకనే చూపుకీ, పిలుపుకీ అందని దూరానికి వెళుతున్నాను! కన్నీరు కార్చి నా ఆత్మకు అశాంతి కలిగించకండి. సుఖ్యా, చిరంజీవీ సుఖం. . . (ప్రాణం విడిచాడు.)

కల్పన: (వెర్రిగా సుందర్ ముఖంలోకి చూస్తూ) ఈ కల్పన్ని అంత గాఢంగా ప్రేమించావా, బావా! (అంటూ అతని కాళ్ళవద్ద కుప్పగా కూలిపోయింది.)

చిరంజీవి: (ఇప్పటికి ఈ లోకంలోకి వచ్చాడు. హఠాత్తుగా, ప్రభాకర్ చేతిలోని రివాల్వర్ లాక్కున్నాడు. భయంతో లేచి నిలబడిన కల్పనకి, ప్రభాకర్కి గురి పెడుతూ వెనక్కి నడిచి మెట్లమీదకి వెళ్ళిపోయాడు.)

ప్రభాకర్: ఆగు! (అంటూ అరిచి, మేడమీదికి చిరంజీవిని వెంబడించాడు. లోపల రివాల్వర్ పేలింది. శబ్దం విని కల్పన అటు వేపు చూసింది. ప్రభాకర్ వెనక్కి నడుస్తూ మెట్లు దిగుతున్నాడు. చిరంజీవి కణతలోంచి రక్తం కారుతుంటుంది. అతని చేతిలో రివాల్వర్ ఉంది. కిందికి దొర్లుకుంటూ వచ్చి, కొద్ది క్షణాలు కొట్టుకుని చనిపోయాడు.)

ఆరిపోయెనా జీవనజ్యోతీ
నసిపోయెనా జీవితకాంతి
ప్రేమమలుపులో సుడిగుండాలా
పగిలిన ఎదలో నిప్పుకణాలా
రగిలిన పొగలే కడకు మిగిలెనా
రగిలిన పొగలే కడకు మిగిలెనా?

★